సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 3 | మే | 2025



..పోస్టులపై తిరకాసు
అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికశాఖకు ఫిర్యాదు చేసింది.

- 10లో▸



ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం
తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 5నుంచి హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు.

- 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$39^0 / 28^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఎండ ఉంటుంది. సాయంత్రం వేళ అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.



చుట్టూ ఇళ్లు.. మధ్యలో కంపు
హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలోని మారుతి కాలనీ – 4, 5 కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో వివిధ ఏరియాల్లో ఇళ్ల నుంచి విడుదలవుతున్న డ్రెయినేజీ నీరు ఆ ఖాళీ ప్లాట్లల్లోకి చేరుతోంది. ఫలితంగా ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళ కంటిమీద కునుకులేకుండా పోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.



వామ్మో ఖమ్మం బైపాస్ రోడ్డు
కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహ కల్ప సముదాయాన్ని ఆనుకుని ఉన్న ఖమ్మం బైపాస్ రోడ్డుపై వీధి దీపాలు లేవు. ప్రతీ రోజు రాత్రయితే చాలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వామ్మో ఖమ్మం బైపాస్ రోడ్డు అంటూ.. ప్రయాణికులు జంకుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ, అతిభారీ వాహనాలు సైతం ఈ దారిమీదుగా వెళ్తుంటాయి. ప్రమాదాల్ని నివారించేందుకు హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.





వీల్ చైర్ల దొంగతనం
ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో ద్విచక్రవాహనాల చోరీ, నగదు అపహరణ, బంగారం, నగల దోపిడీ వంటివి తరుచూ జరుగుతాయి. కానీ గతానికి భిన్నంగా.. వీల్ చైర్ల దొంగతనం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రోగులను తరలించే స్ట్రెచర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది నిర్లక్ష్యం, మామూళ్ల మత్తులో మునిగి పోవడం కారణంగా వీల్ చైర్ల దొంగతనం జరుగుతుండడం గమనార్హం. ఈక్రమంలో ఆస్పత్రి సమీపంలోని బస్టాప్‌లో ఓ పేషెంట్‌ను వీల్‌చైర్‌లో అటెండెంట్ తీసుకెళ్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కాడు.



ఎక్కడి చెత్త అక్కడే..
ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ ఖమ్మం రహదారికి ఇరువైపులా ఉన్న నాగమయ్య కమాన్, విశ్వనాథకాలనీ రహదారులు, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. వర్షాకాలమైతే మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. రహదారులపై ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు పడిపోయినా పట్టించుకునే వారే లేరు. డ్రెయినేజీల్లో చెత్తపేరుకపోయింది. దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, మురుగు కాల్వల్లో పూడిక చేపట్టాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.



చిట్టడవిలా ఖాళీ స్థలాలు
నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంటలో నివాసాల నడుమ పలు చోట్ల ఖాళీ స్థలాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే కాలనీ కానీ, పల్లెటూరి మాదిరిగా ఎక్కడ పడితే అక్కడ ఖాళీ స్థలాలు చిట్టడవిలా ఏర్పడి కుక్కలు, కోతులు, పాములు, విష పురుగులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కాలనీవాసులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడంతో భరించలేని దుర్వాసన వస్తోంది.

సివిల్ సప్లయీస్‌కు
సీఎంఆర్ చిక్కులు

పెండింగ్‌లో గత రబీ, ఖరీఫ్ సీఎంఆర్ బియ్యం

- లక్ష్యానికి దూరంగా చాలామంది రైస్‌మిల్లర్లు
- గడువు పెంచినా కదలని సీఎంఆర్ బకాయి
- ఊపందుకున్న రబీ ధాన్యం కొనుగోళ్లు
- డిఫాల్టర్లకు సీఎంఆర్ ఇవ్వొద్దని సర్కారు ఆదేశం..
- 'ప్రత్యామ్నాయం'పై కసరత్తు



సాక్షిప్రతినిధి, వరంగల్:

- **హనుమకొండ జిల్లా** ఎల్కతుర్తి మండలంలోని ఓ రైస్‌మిల్లుకు 2021–22, 2022–23 సంవత్సరాలకు కేటాయించిన సీఎంఆర్ కింద 4,310 మె.టన్నుల బియ్యానికి 1,889 మె.టన్నులు మాత్రమే సరఫరా చేశారు. సుమారు రూ.7.50 కోట్ల విలువైన బియ్యం ఎగవేయడంతో అప్పట్లో సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి బియ్యం లేకపోవడంతో కేసులు నమోదు చేసి డిఫాల్టర్ లిస్టులో చేర్చారు.
- **మహబూబాబాద్ జిల్లాలోని** మూడు మిల్లుల్లో గత సీజన్‌లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. అదే విధంగా కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.30 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించి కేసులు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైస్‌మిల్లర్లకు సరఫరా చేయాల్సి ఉండగా.. ఈసారి డిఫాల్టర్లకు ఇవ్వొద్దని ప్రభుత్వం నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. 20 శాతం మిల్లర్లు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉంది. సివిల్ సప్లయీస్ అధికారులు వాటిపై పునరాలోచన చేస్తూ మిగతా మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నారు. ధాన్యం దిగుబడుల అంచనాలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్‌లో 987 కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. ఈమేరకు జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పాక్షికంగా సాగుతుండగా.. మిగతా జిల్లాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ధాన్యం అమ్ముకుంటున్న రైతులకు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మెనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్) ద్వారా డబ్బు బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నారు.

రబీ సీజన్ సీఎంఆర్ ఆచితూచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాయిల్డ్, రా రాస్ మిల్లులు 328 వరకు ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాలోని మిల్లుల నుంచి బకాయిలు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు రావాల్సి ఉందని ఫైనల్‌గా తేల్చారు. సీఎంఆర్ బకాయి ఉన్న డిఫాల్టర్లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వరాదన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్ 10.24 లక్షల మె.టన్నుల మేరకు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసిన అధికారులు 987 కొనుగోలు కేంద్రాల కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇన్‌టైమ్‌లో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకే సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డిఫాల్టర్‌గా ఉన్న రైస్‌మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని సకాలంలో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకు తరలించడమా? లేక ఈ సీఎంఆర్ బకాయి రాబట్టుకుని అదనంగా జమానత్‌లు తీసుకుని వారికే ఇవ్వడమా? అన్న కోణంలో కసరత్తు చేస్తున్నారు.

దాడులు, కేసులు పెట్టినా అదే మొండివైఖరి...

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని పలు జిల్లాల్లో కొందరు రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూకుమ్మడి తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గత రబీ సీజన్‌లో సీఎంఆర్ కోసం కూడా హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. వరంగల్ జిల్లాలోని ఓ మిల్లులో రూ.3.79 కోట్ల విలువైన 12,360 క్వింటాళ్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేసు పెట్టారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్‌లో జరిపిన తనిఖీల్లో ఆరేడు సంవత్సరాలకు సంబంధించిన రూ.201 కోట్లకు పైగా విలువైన బియ్యం బకాయి ఉన్నట్లు వెల్లడించారు. కాగా ఇప్పటికే డిఫాల్టర్ జాబితాలో ఉన్న పలువురికి నోటీసులు జారీ చేశామని, 6ఏ కేసులు కూడా నమోదు చేశామని, అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టు కూడ పెడతామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

శోభాయమానం.. భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణం





కల్యాణోత్సవంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు, హాజరైన కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ సుధారాణి, భద్రకాళి ఆలయ ఈఓ శేషు భారతి, భక్తులు

అమ్మవారికి ఉదయం సింహ వాహన సేవ, సాయంత్రం గజ వాహన సేవ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం రాత్రి భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం శోభాయమానంగా జరిగింది. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి.. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై, సాయంత్రం గజవాహనంపై ఊరేగించారు. సేవా కార్యక్రమాలకు వరంగల్ కమ్మసేవా సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. శుక్రవారం కావడంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ తంతు శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవాదుల.. పరిష్కారమెలా?

- నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కీలక సమీక్ష
- మూడో దశలో భూసేకరణే అసలు సమస్య
- ఏటా పెరుగుతున్న ప్రాజెక్టు అంచనా
- దేవన్నపేట పంపుహౌస్, ధర్మసాగర్‌లో పర్యటించనున్న మంత్రి
- భద్రకాళి పూడికతీత పనులు.. సివిల్ సప్లయీస్‌పై రివ్యూ





- సాక్షిప్రతినిధి, వరంగల్

- వివరాలు 10లో▸

సుందరీమణుల పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద
- అధికారులతో సమన్వయ సమావేశం

హన్మకొండ అర్బన్: ఈనెల 14న ప్రపంచంలోని వివిధ దేశాల సుందరీమణులు వరంగల్ నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్లు, సీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ షోబోట్ ప్రతినిధులు వివిధ దేశాల సుందరీమణులు సందర్శించే ప్రదేశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్లు మాట్లాడుతూ.. సుందరీమణులు హైదరాబాద్ నుంచి హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కి చేరుకుంటారని, అక్కడ వారికి స్వాగతం, బతుకమ్మ ఆటాపాట కార్యక్రమం ఉంటుందన్నారు. వారి రాక సందర్భంగా పోలీస్ భద్రత పటిష్టంగా ఉండాలన్నారు. హరిత కాకతీయ నుంచి వేయి స్థంభాల దేవాలయానికి చేరుకుని దైవ దర్శనం చేసుకుంటారని తెలిపారు. అనంతరం ఫోర్ట్ వరంగల్‌ను సందర్శించనున్నట్లు, హరిత కాకతీయలో డిన్నర్ అనంతరం హైదరాబాద్‌కు బయల్దేరుతారన్నారు. పర్యటన సమయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఆలయ విశిష్టతను తెలియజేసేందుకు గైడ్ అందుబాటులో ఉండాలన్నారు. ఫొటో షూట్, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏఎస్పీ మనన్ భట్, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్, పర్యాటకశాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలని ఏర్పాటు చేయాలి

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్) ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కొత్తగా రెవెన్యూ మండలాల ప్రాతిపదికగా రైతు పరపతి సేవల కోసం పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కాజీపేట మండలం కాజీపేట దర్గా, హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌తోపాటు మరికొన్ని మండలాల్ల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, అధికారులు సంజీవరెడ్డి, చంద్రశేఖర్, రవీందర్ సింగ్, కొమరయ్య, నజీర్ సుల్తాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి..

హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు

హన్మకొండ అర్బన్/వరంగల్: ఈనెల 4న జిల్లాలో నిర్వహించనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సత్యశారద తెలిపారు. ఆయా కలెక్టరేట్లలో వారు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులకు సరిపడా బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: సీపీ

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో ఈనెల 4న (ఆదివారం) జరిగే నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 పరీక్ష కేంద్రాలున్నాయని, ఇందులో వరంగల్, హనుమకొండలో 11 కేంద్రాలు, హనుమకొండ జిల్లాలో 4,680 మంది విద్యార్థులు, వరంగల్ జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 240 మంది పరీక్ష రాయనున్నారు. జనగామలో 2 పరీక్ష కేంద్రాలున్నట్లు తెలిపారు. జనగామలో 580 మంది విద్యార్థులు మొత్తం 5,260 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు.. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అములులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, ధర్నాలు, గుంపులుగా తిరగడం నిషేధమని, పరీక్ష పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసేయాలని కోరారు.

కోట చెరువు పూడికతీతకు చర్యలు

మేయర్ గుండు సుధారాణి

వరంగల్: దేశాయిపేట సమీపంలోని కోట చెరువు పూడికతీతకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ దేశాయిపేటలోని కోట చెరువును ఇరిగేషన్, బల్దియా, ఇంజనీరింగ్ శానిటేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో మేయర్ పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ముంపు నివారణ చర్యల్లో భాగంగా యాటీ నుంచి కోట చెరువు వరకు డీసిల్టింగ్ ప్రక్రియ చేపట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కోట చెరువు పరిధి ఆక్రమణకు గురవకుండా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. మేయర్ వెంట బల్దియా ఎంహెచ్ఓ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ ఖాదర్, ఏసీపీ శ్రీనివాస్ కార్పొరేటర్లు సురేశ్‌జోషి, బస్వరాజు కుమార్ ఉన్నారు.



కోట చెరువును పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

సమీక్ష సమావేశంలో కమిషనర్

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులున్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు షురూ

విద్యారణ్యపురి: తెలంగాణలో ఈవిద్యాసంవత్సరంలో 2025–26లో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు టీజీఎప్‌సెట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షకు ఉదయం సెషన్‌లో వరంగల్ జోన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు పలు పరీక్ష కేంద్రాల్లో 2,197 మందికి 2,125 మంది (96.46 శాతం) హాజరయ్యారు. వారిలో 72 మంది గైర్హాజరైనట్లు టీజీఎప్‌సెట్ కన్వీనర్ జేఎన్టీయూ ప్రొఫెసర్ బి.డీన్ కుమార్ తెలిపారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పరీక్షలకు 2,200 మంది అభ్యర్థులకుగాను 2,135 మంది అభ్యర్థులు (97 శాతం) హాజరు కాగా.. 65 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. నర్సంపేటలో ఉదయం సెషన్‌లో 280 మంది అభ్యర్థులకు 270 మంది హాజరుకాగా, రెండో సెషన్‌లో మధ్యాహ్నం పరీక్షకు 180 మందికి 266 మంది హాజరు కాగా.. అందులో 14 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు భద్రత చెక్కుల అందజేత



వరంగల్ క్రైం : కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ పలు కారణాలతో గతేడాది మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు భద్రత విభాగం మంజూరు చేసిన చెక్కులను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. కానిస్టేబుల్ నర్సింహస్వామి కుటుంబానికి రూ.7,36,830, మరో కానిస్టేబుల్ కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.5.87 లక్షల విలువైన చెక్కులను సీపీ అందజేశారు. వారి కుటుంబ స్థితిగతులను సీపీ ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏఓ రామకృష్ణ స్వామి, సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్ మైదానంలో క్రీడా పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. గురువారం ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ముగిశాయి. ముగింపు వేడుకలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య హాజరై కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, బ్యాడ్మింటన్ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి వీరన్న, బాధ్యులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలకు అనూహ్య స్పందన

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అనూహ్య స్పందన లభించినట్లు డీవైఎస్ఓ గుగులోత్ అశోక్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం శిక్షణ శిబిరాలను సందర్శించిన ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ సెలవుల్లో సమయపాలనతో శిక్షణకు హాజరవ్వాలన్నారు.

5 నుంచి సెలవుల్లో అదనపు కలెక్టర్

హన్మకొండ అర్బన్ : వ్యక్తిగత కారణాలపై విదేశాలకు వెళ్తున్న క్రమంలో ఈనెల 5వ తేదీ నుంచి హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సెలవుల్లో ఉండనున్నారు. ఈ మేరకు నెల రోజులు సెలవులు కోరుతూ ఆయన లేఖ రాయగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు ఉత్తర్వుల్లో పేర్కొన్నాయి. దీంతో నెల రోజులు శ్రీనివాస్ అదనపు కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

కేన్సర్ పేషెంట్‌కు సీఎంఆర్‌ఎఫ్

హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన రావుల రాజయ్య కేన్సర్ బారిన పడి హైదరాబాద్‌లోని ఏంఎంజే కేన్సర్ ఇన్స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాశ్.. రాజయ్య చికిత్స కోసం రెండోసారి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ ద్వారా రూ.4 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును శుక్రవారం అతడి కుటుంబ సభ్యులకు అందించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

విద్యారణ్యపురి : తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు మూల్యాంకన కేంద్రాలుగా ఉండగా అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండలో తోటబడిని ఎంపిక చేశారు. ఈనెల 5నుంచి 7వతేదీ వరకు టెన్త్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం, 8నుంచి 10వతేదీవరకు ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం శుక్రవారం తెలిపారు.ఈ కేంద్రానికి టెన్త్ పరీక్షల జవాబు పత్రాలు 9,379 ఉండగా, ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాలు 16,286 కేటాయించారు. చీఫ్ ఎగ్జామినర్లుగా 13మంది, ఏఈలుగా 77మంది ఉపాధ్యాయులను, స్పెషల్ అసిస్టెంట్లుగా 13 మందిని నియమించామని సదానందం చెప్పారు.

అదృశ్యమైన బాలుడు చెరువులో శవమై..

గూడూరు : రెండ్రోజుల క్రితం తండ్రితో ఆటోలో వస్తూ కనిపించకుండా పోయిన బాలుడు శుక్రవారం చెరువులో శవమై తేలాడు. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్‌తండాకు చెందిన బాలుడు వాంకుడోత్ జాన్‌పాల్ (6) తండ్రి కృష్ణమూర్తితో కలిసి ఆటోలో వస్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా సీతానగరం శివారు రాళ్ల చెరువులో శవమై కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అన్‌యూజ్డ్ పోస్టులపై తిరకాసు

వర్క్‌మెన్ పోస్టులు ఉన్నతీకరించడంతో వ్యతిరేకత

- కార్మిక శాఖకు ఫిర్యాదు.. 9న జాయింట్ మీటింగ్
- సబ్ స్టేషన్లలో ఆపరేటర్ల కరువు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



హన్మకొండ : అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై కార్మిక శాఖ విచారణ చేపట్టడంతో ఈ వివాదం ఎటువైపు తిరుగుతుందోనని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. వర్క్‌మెన్ క్యాడర్ పోస్టులను ఉన్నతాధికారుల పోస్టులుగా ఉన్నతీకరించడం వివాదస్పదంగా తయారైంది. విద్యుత్ ఉద్యోగులతో పాటు, కొన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మిక శాఖకు ఫిర్యాదు చేసింది. అన్‌యూజ్డ్‌గా ఉన్న వర్క్‌మెన్ పోస్టులను రెగ్యులర్ పోస్టులుగా క్షేత్ర స్థాయిలో భర్తీ చేసి భారం తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కోరితే ఇందులో కొన్నింటిని వర్క్‌మెన్‌గా, మరికొన్నిటిని పీ అండ్ జీ, ఇంజనీర్స్, అకౌంట్స్ విభాగం అధికారులకు పదోన్నతులకు అనుగుణంగా ఉన్నత స్థాయి పోస్టులు సృష్టిస్తూ నిర్ణయం తీసుకున్నారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయి, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు వృథాగా ఉంటున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై భారం పడుతోంది.

- కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న 215 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు, ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల 200 పోస్టులు.. మొత్తం 415 పోస్టుల స్థానంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, 20 జూనియల్ అకౌంట్స్ ఆఫీసర్, 88 సీనియర్ అసిస్టెంట్, 32 సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, 48 అసిస్టెంట్ లైన్‌మెన్, 88 ఆఫీస్ సబార్డినేట్, ఆరు స్వీపర్ పోస్టులుగా మార్చినట్లు సమాచారం. 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులుగా స్థిరీకరించారు.
- ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున కొత్తగా పోస్టులు సృష్టించడాన్ని క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వర్క్‌మెన్ క్యాడర్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో యూనియన్ నాయకులు మూడు నెలల క్రితం కార్మిక శాఖకు ఫిర్యాదు చేయగా దీనిపై వివరణ ఇవ్వాలని లేఖ రాసినా స్పందించలేదు. దీంతో ఈ నెల 9న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రాజేంద్ర ప్రసాద్ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అన్‌యూజ్డ్ పోస్టుల వ్యవహారం ఎటువైపు తిరుగుతుందో అని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

ఉద్యోగులపై అదనపు భారం

టీజీ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు 932 ఖాళీగా ఉండగా 25 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. కోర్టులో కేసు కారణంగా మిగతా పోస్టులు భర్తీ చేయలేదు. మిగిలిన 839 పోస్టుల్లో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నత స్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ అమోదానికి పంపినట్లు సమాచారం . కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్ల నియామకం చేపట్టకపోవడంతో అందుబాటులో ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందని, కొన్ని సబ్‌స్టేషన్‌లలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

అమ్మానాన్నే నాకు ప్రేరణ..

కుటుంబ సహకారంతోనే విజయం



- దారా మేఘన

'మా కుటుంబం న్యాయవిద్యతో ముడిపడినందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది. చిన్ననాటి నుంచి న్యాయశాస్త్రాన్ని చూసి పెరిగిన నేను, ఇప్పుడు అదే కుటుంబ పరంపరలో భాగంగా న్యాయం కోసం పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఇది నాకు బాధ్యతను గుర్తు చేస్తోంది, ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్న కర్తవ్యం కలిగిస్తోంది.' అని అంటున్నారు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన దారా మేఘన. ఇటీవల వెలువడిన న్యాయశాస్త్ర ఫలితాల్లో వరంగల్ దర్గా కాజీపేటకు చెందిన మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023 న్యాయశాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ప్రయాణంపై 'సాక్షి' పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

-వరంగల్ లీగల్

- మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో లా ప్రొఫెసర్..
- తరచూ అక్కడి వాతావరణాన్ని చూపించేవారు..
- 'సాక్షి'తో దారా మేఘన
- ఇటీవల న్యాయశాస్త్ర ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక

ప్రశ్న: ఎల్ఎల్‌బీని ఎందుకు ఎంచుకున్నారు?

జవాబు : నేను న్యాయశాస్త్రాన్ని ఎంచుకోవడానికి కారణం మా నాన్నగారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే న్యాయవిద్యను నా వృత్తిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. జీవితమంతా ఆయన నాకు మోటివేషన్‌గా నిలిచారు. మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే నాకు లా స్కూల్ వాతావరణాన్ని, విద్యార్థులను చూడగల అవకాశం కలిగింది. ఇదంతా న్యాయశాస్త్రం పట్ల నాలో ఆసక్తిని, అభిమానం పెంచింది.

ప్ర : మీకు ప్రేరణ ఎవరు.

జ : మా తల్లిదండ్రులే నాకు ప్రేరణ. మా నాన్న న్యాయశాస్త్ర ప్రొఫెసర్, అమ్మ ఎల్ఐసీలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్నారు. వారి శ్రద్ధ, క్రమశిక్షణ నన్ను జీవితాన్ని సరిగ్గా ముందుకు నడిపించడంలో కలిసి వచ్చింది. ఏ రంగాన్ని ఎంచుకున్నా, దానికి ప్రోత్సాహం, స్వేచ్ఛను ఇచ్చారు. ఇక తమ్ముడు వంశీకృష్ణ ఎప్పుడూ నాకు మద్దతుగా నిలిచి, విద్యార్థినిగా ఎదుర్కొన్న కష్టాల్లో తోడుగా ఉన్నాడు. అలాగే, ప్రముఖ సీనియర్ అడ్వొకేట్ సి.విద్యాసాగర్ రెడ్డితో పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆయన నుంచి న్యాయశాస్త్రం ప్రాయోగిక అంశాల్లో మార్గదర్శనం పొందాను. ఈ రంగాన్ని ఎంపిక చేసుకోవాలని ఆయన అప్పట్లో ఇచ్చిన సలహా నా జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇంకా, మా కళాశాల నుంచి పెద్దగా విజయాలు సాధించిన మా సీనియర్లు తరణి వేముగంటి, నేహా అగర్వాల్ విజయాలను దగ్గరగా చూసే అవకాశం లభించింది. తరణి ప్రస్తుతం సిద్దిపేటలో జూనియర్ సివిల్ జడ్జిగా, అదనపు జేఎంఎఫ్‌సీగా పనిచేస్తున్నారు. నేహా అగర్వాల్ డీఎస్పీ పదవిని పొందారు. వారి మాటలు నాకు దిక్సూచి చూపాయి.

ప్ర : ఎందుకు న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు.

జ : న్యాయశాస్త్రం ద్వారా న్యాయం సాధించడమే కాక సమాజానికి సేవ చేయవచ్చని నమ్మి ఈ మార్గాన్ని ఎంచుకున్నాను

ప్ర : మీరు ఎదుర్కొన్న సవాళ్లు.

జ : నా ప్రయాణంలో ఒత్తిడి, ఆందోళన ఎదుర్కోవాల్సి వచ్చింది. సమయం కూడా చాలా పరిమితంగా ఉండటంతో, ఆ సమయంలోనే అన్ని విభాగాలను కవర్ చేయాలన్న ఒత్తిడితో ఉన్నా. ఇదే సమయంలో, మా తమ్ముడు అమెరికాకు మాస్టర్స్ కోసం వెళ్లిపోవడం కూడా నాకు భావోద్వేగపూరితంగా కష్టంగా అనిపించింది. అయితే, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అండగా నిలిచి నా అడ్డంకులను అధిగమించడంలో సహాయం చేశారు.

ప్ర : మీ నెక్ట్స్ గోల్?

జ : ఇప్పటినుంచి నా లక్ష్యం అత్యంత నిజాయితీగా, సమగ్రతతో సేవ చేయడం. న్యాయం వేగంగా అందించడానికీ, ఆలస్యం లేకుండా ప్రజలకు న్యాయం చేసేందుకు కట్టుబడి పని చేయాలనుకుంటున్నాను. నాకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, తమ్ముడికి, స్నేహితులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఈ విజయాన్ని నాతో కలిసి పంచుకున్న బంధువులకు కూడా ధన్యవాదాలు.



'జంపన్న'కు జలకళ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలోని జంపన్న వాగు నీటితో కళకళలాడుతోంది. గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో జంపన్న వాగులోకి వరద చేరింది. మొన్నటి వరకు చుక్కనీరు లేక ఎండిపోయి..ఇసుక దిబ్బలను తలపించింది. ఎగువ ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం పడడంతో జంపన్నవాగులోకి వరద చేరి జలకళ సంతరించుకుంది. శుక్రవారం అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి వచ్చిన భక్తులు జంపన్న వాగు నీటిలో పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోయారు. జంపన్న వాగులోకి వరద ప్రవహిస్తుడడంతో భక్తులు స్నానాలు ఆచరించే క్రమంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా జంపన్నవాగులో ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని పూజారులు కోరుతున్నారు.

బక్కమ్మ@105



- బక్కమ్మ



బక్కమ్మ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి 105వ జన్మదిన సంబరాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధురాలైన చీమల బక్కమ్మ 104 సంవత్సరాల వయస్సును పూర్తి చేసుకుని 105వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కతాటిపైకి చేరుకుని శుక్రవారం గ్రామంలో ఆనందోత్సవాల నడుమ జన్మదినాన్ని నిర్వహించారు. బక్కమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరి తరపు కుటుంబమంతా (121) మంది బుధరావుపేటలో శుక్రవారం కలుసుకుని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు



దాడిలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాజీపేట : కాజీపేట పట్టణంలో పర్వతలాల్ ఐస్‌క్రీమ్ తయారీ, డిస్ట్రిబ్యూటర్ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు చేసి రూ.29,050 విలువ చేసే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాణ్యత పాటించకుండా ఐస్‌క్రీమ్‌ల తయారీ, గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లు, పాడైన ఐస్‌క్రీమ్‌లను పట్టుకున్నారు. దుకాణం యజమాని నమ్తాబాద్ అమర్‌నాథ్‌పై తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

దేవాదుల.. పరిష్కారమెలా?

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష

- మూడో దశలో భూసేకరణే అసలు సమస్య..
- దేవన్నపేట పంపుహౌస్, ధర్మసాగర్ సందర్శన

సాక్షి ప్రతినిధి, వరంగల్ : జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం 91 శాతం పూర్తయినా.. మూడో దశలో భూసేకరణతో పనులు ముందుకు సాగక అసంపూర్తిగా మిగిలుతోంది. ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని తొమ్మిది జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే ఈ పథకానికి పూర్తి స్థాయిలో మోక్షం కలగడం లేదు. గతేడాది ఆగస్టు 31న కన్నాయిగూడెం బ్యారేజీ వద్ద మంత్రులు, కలెక్టర్లు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి 2026 మార్చిలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 37 మండలాల్లో 5,56,722 ఎకరాలకు నీరిందించడం ఈ పథకం లక్ష్యం.

భూసేకరణే ప్రధాన సమస్య..

ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అయితే మూడో దశలో నిలిచిపోయిన భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు 20 ఏళ్లయినా అసంపూర్తిగానే ఉంటుంది. రైతులు ఎక్కువ పరిహారాన్ని డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి భూసేకరణకు అడ్డంకిగా మారాయి.

పెరుగుతున్న ప్రాజెక్టు అంచనా వ్యయం..

యాసంగి పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలకు నీరందించే సందర్భంలో పలుమార్లు మోటార్లు మొరాయించాయి. ఇదిలా ఉండగా 2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం, 2020 జూన్ నాటికి రూ.14,729.98 కోట్లకు పెరిగింది. 2023లో రూ.17,500 కోట్ల చేరుతుందని అంచనా వేశారు. ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా విపరీతంగా పెరుగుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తి భూసేకరణే అసలు సమస్యగా మారగా, 33,224 ఎకరాలకు 30,268 ఎకరాలు పూర్తి చేశారు. జనగామలో 945 ఎకరాలు, పాలకుర్తిలో 826, గజ్వేల్‌లో 230, నర్సంపేటలో 131, వర్ధన్నపేటలో 168 ఎకరాలు.. ఇలా మొత్తంగా 2,957 ఎకరాల సేకరణపై చిక్కుముడి వీడితే ప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం కానుంది.

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూ..

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:15 గంటల వరకు దేవన్నపేట పంప్ హౌజ్‌పై రివ్యూ చేయనున్నారు. అనంతరం 2:30 నుంచి 2.45 గంటల వరకు ధర్మసాగర్ రిజర్వాయర్ సిస్టర్న్, డెలివరీ టన్నెల్ పనులపై, 3గంటల నుంచి 3:30 గంటల వరకు వరద నియంత్రణ, భద్రకాళి చెరువు పూడిక తీత పనులపై సమీక్ష చేయనున్నారు. అలాగే 3:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పురోగతిలో ఉన్న నీటి పారుదల శాఖ పనులు, పౌర సరఫరాల శాఖ సమస్యలపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన అధికారులతో హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూ చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హనుమకొండ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

డంపింగ్ యార్డులో మగశిశువు మృతదేహం



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ : మడికొండ-రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డులో నవజాత శిశువు మృతదేహం లభించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ శుక్రవారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. డంపింగ్ యార్డులో పని చేస్తున్న సిబ్బందికి శిశువు మృతదేహం కనిపించగా మడికొండకు చెందిన బైరి లింగమూర్తికి సమాచారం ఇచ్చారు. లింగమూర్తి వెంటనే ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు విషయం తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిషన్ మృతదేహాన్ని పరిశీలించి చనిపోయినది మగ శిశువుగా గుర్తించారు. లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. శిశువు మృతదేహం ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియడం లేదని, నగరంలోని ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి పడేశారా లేక ఇతరులు ఎవరైనా పడేశారా అని పరిశీలిస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ కిషన్ వివరించారు.

5 నుంచి రెవెన్యూ సదస్సులు



వీసీలో పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్/వరంగల్: జిల్లాలోని ఒక మండలంలో ఈనెల 5 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌తో కలిసి భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, భూ సేకరణ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. నీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రవీందర్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసులు, నడికూడ తహసీల్దార్ నాగరాజు, వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతి, డీఈఓ జ్ఞానేశ్వర్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భగవత్ భక్తే ప్రధాన మార్గం



జ్యోతిప్రజ్వలన చేసి గురువుల జయంతి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

- రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ
- ఘనంగా ఆదిశంకరులు, రామానుజాచార్యుల జయంతి

హన్మకొండ కల్చరల్: పరమాత్ముడి సృష్టి మోక్షాన్ని పొందడానికి భగవత్ భక్తే ప్రధాన మార్గమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శుక్రవారం జగద్గురు ఆదిశంకరులు, శ్రీమద్ రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణలోని 'కుడా' గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వేదికపై ఆదిశంకరులు, రామానుజాచార్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి, ధన్వంతరి సేవా సమితి ఆధ్వర్యంలో గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 'కుడా' గార్డెన్స్‌లో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మిస్తామని, కళాకారులు కార్యక్రమాలు చేసుకోవడానికి అందుబాటులోకి తెస్తామన్నారు. సంస్కృత పండితులు సముద్రాల శఠగోపాచార్యులు అద్వైత, విశిష్ట అద్వైత ద్వైమూర్తుల ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ధన్వంతరి సేవా సమితి అధ్యక్షుడు గుదిమెళ్ల విజయ్‌కుమార్, ఆచార్యులు చెరుకుపల్లి శ్రీనివాసచార్యులు, శ్రీధరాచార్యులు, సమితి అధ్యక్షుడు అయినవోలు వెంకటసత్యమోహన్, రాఘవరావు, సందీప్‌శర్మ, లంక శివకుమార్, పెండెం రాఘవరావు, సముద్రాల సుదర్శన, లక్ష్మీనరసింహాచార్యులు, చకిల సుధాకర్, గంగు మణికంఠ, తనుగుల రత్నాకర్, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సన్మానం



కలెక్టర్ సత్యశారదతో విద్యార్థులు

వరంగల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ సత్యశారద శుక్రవారం సన్మానించారు. పరీక్షల సమయంలో స్ఫూర్తి కార్యక్రమం ద్వారా కలెక్టర్ విద్యార్థుల్లో పరీక్షలపై భయాన్ని పోగొట్టి, ప్రోత్సహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దావత్ ఇస్తానని చెప్పిన ఆమె.. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అధికారులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

- సాయినగర్‌లో విషాద ఘటన



ఆర్యన్ (ఫైల్)



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

ఎల్కతుర్తి : ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం సాయినగర్ నూతన గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. (కొత్తపల్లి) సాయినగర్ గ్రామానికి చెందిన కూన రాకేశ్-రవళి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాకేశ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. తల్లి రవళి వంటపనిలో నిమగ్నమైంది. కుమారుడైన ఆర్యన్ (11 నెలల బాలుడు) ఇంటి ఆవరణలో అరుగుపై ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. బాలుడిని ఎవరూ గమనించకపోవడంతో ఆర్యన్ మృతిచెందాడు. ఇంటికొచ్చిన బాలుడి తండ్రి రాకేశ్ నీటి సంపు దగ్గరకు వెళ్లగా.. అందులో ఆర్యన్ మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.